క్లుప్తంగా

తేలప్రోలులో పశువులకు ఉచిత వైద్యసేవలు



తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో బుధవారం ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి లాం దిబోర ప్రారంభించారు. అనంతరం 130 గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు, 70 గేదెలు, 28 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. అదే విధంగా ఆవులకు చూడి నిర్ధారణ పరీక్షలు, గేదెలకు గర్భకోశ సంబంధిత చికిత్స చేసి మందులు అందించారు. పశుసంవర్ధక శాఖ గన్నవరం డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ గోపిచంద్, అల్లాపురం సహాయ సంచాలకులు డాక్టర్ బాలకృష్ణ, వెటర్నరీ కళాశాల డాక్టర్లు కమలాకర్, బిందు కిరణ్మయి, చైతన్య, సుధాకర్‌రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోడల్ ఫౌండేషన్ స్కూల్ వార్షికోత్సవం



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో ఉన్న మోడల్ ఫౌండేషన్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత వేడుకలను గ్రామ సర్పంచి బడుగు బాలమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆటపాటలతో కూడిన విద్య పిల్లల్లో మానసిక, శరీరక ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. ప్రైవేట్ స్కూల్స్‌కు దీటుగా ఈ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయలను కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్య, క్రీడాల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం జంగం కుమారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం డి.ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు లక్ష్మీదుర్గ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు



ఉయ్యూరురూరల్: మండలంలోని కాటూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొని గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యం, ఆహారం విషయంలో వైద్యుల సహకారాన్ని తీసుకుంటూ సంతోషంగా ఉండాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాటూరు సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి, వైద్యాధికారి ఉమామహేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని, నాయకులు వేమూరు శ్రీనివాసరావు, కొడాలి రవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

పటమట(విజయవాడతూర్పు): బాల్యం నుంచి ఆటపాటలు, పుస్తక పఠనం ద్వారా వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చని, వేసవి సెలవుల్లో పిల్లల్లో ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమం దోహద పడుతూ ఉందని పిల్లల వైద్య నిపుణులు శ్రీముఖి ఆశాభావం వ్యక్తం చేశారు. పటమట సర్వోత్తమ గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం టాయ్ లైబ్రేరీని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె ప్రారంభించారు. ఏపీ గ్రంథాలయ సంఘం కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ఉచిత పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, దానితో పాటు ఈ ఏడాది టాయ్ లైబ్రరీ ఏర్పాటు చేశామని అన్నారు. జూన్ 10వ తేదీ వరకు సాయంత్రం 4 నుంచి 6 సమయంలో ఆట వస్తువులు, బొమ్మలు సృజనాత్మక పెంచే పలు ఆసక్తి కరమైన కార్యక్రమాలు, పోటీలు జరుగుతాయని వివరించారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

కంకిపాడు: పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించారు. ప్రతిభలో తామేమీ తక్కువకాదని నిరూపించారు. విద్యార్థులను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

కంకిపాడులో 61.23 శాతం ఉత్తీర్ణత..

మండలం వ్యాప్తంగా10 జిల్లా పరిషత్ పాఠశాలల్లో 454 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 278 మంది ఉత్తీర్ణత సాధించగా, 176 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. మండలంలో 61.23 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కంకిపాడు జెడ్పీ పాఠశాలకు చెందిన సీహెచ్ మౌనిక(579), సీహెచ్ శ్రీమహాలక్ష్మి(570), మద్దూరు జెడ్పీ విద్యార్థిని తమ్మ మహాలక్ష్మి(561) మార్కులతో తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఉత్తీర్ణత శాతంలో మద్దూరు జెడ్పీ పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. 18 మంది విద్యార్థులకు 14 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 77.78 ఉత్తీర్ణత శాతం నమోదుతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. 75 శాతం ఉత్తీర్ణతతో ప్రొద్దుటూరు జెడ్పీ పాఠశాల, 68.50 శాతం ఉత్తీర్ణతతో మంతెన జెడ్పీ పాఠశాల తరువాత స్థానాల్లో నిలిచాయి. విద్యార్థులను, ఉపాధ్యాయులను ఎంఈఓ-2 ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

పెనమలూరు విద్యార్థుల ప్రతిభ

పెనమలూరు: టెన్త్ ఫలితాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.తేజశ్రీ(582), యనమలకుదురు పాఠశాలకు చెందిన ఎండీ.ఖుద్దూస్(578), పెనమలూరు పాఠశాలకు చెందిన ఆర్.పావని(577), అనూష(576), ఎస్‌కె.హఫ్సస(575), కె.నాగనిత్య(575) సాధించి అగ్ర స్థానంలో నిలిచారు. ఎంఈఓ శేషగిరిరావు బుధవారం వివరాలు తెలుపుతూ మండలంలోని ఆరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొత్తం 975 మంది పరీక్షలు రాశారన్నారు. వీరిలో 569 మంది ఉత్తీర్ణులు కాగా ఉత్తీర్ణత శాతం 70.5గా ఉంది. యనమలకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 24 మంది పరీక్ష రాయగా 18 మంది(75 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వణుకూరు పాఠశాలలో 24 మందికి 19 మంది(79 శాతం), పోరంకిలో 80 మందికి 51 మంది(64 శాతం), 243 మందికి 193 మంది(79 శాతం), తాడిగడప పాఠశాలలో 93 మందికి 53 మంది(58 శాతం), కానూరులో 106 మందికి 72 మంది(68 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వణుకూరు పాఠశాలలో వై.లతమాధురికి 526. పోరంకి పాఠశాలలో అఖిల్‌కు 564, తాడిగడప పాఠశాలలో మణికంఠకు 557, కానూరు పాఠశాలలో ఆర్.సాయికార్తీక్‌కు 561 మార్కులతో పాఠశాల ఫస్టు వచ్చారు. గంగూరు గ్రామానికి చెందిన ఎండి.అజ్మల్‌షరీఫ్ 592 మార్కులు వచ్చాయి. సాధారణ కుటుంబంలో జన్మించిన అతను గంగూరు నోబుల్ పాఠశాలలో చదివాడు. ఈ సందర్భంగా తండ్రి ఇస్మాయిల్ షరీఫ్, తల్లి రెహిమాసుల్తానాను గ్రామస్తులు, బంధువులు అభినందించారు.



నున్న జెడ్పీ హైస్కూల్ సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ;



నిడమానూరులో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు



షేక్ ఆఖిల(596)ను అభినందిస్తున్న నారాయణ ఉపాధ్యాయ బృందం



పూర్వజశ్రీ(592)ని అభినందిస్తున్న శ్రీచైతన్య ఉపాధ్యాయులు



పల్లపోతుల రాజేష్(591)



హేమంత్ సాయి కుమార్(580)



సీహెచ్ మౌనిక (579)



సీహెచ్ శ్రీమహాలక్ష్మి(570)



తేజశ్రీ (582)



అజ్మల్ షరీఫ్(592)



జి.అనూష (587)



టి.మహాలక్ష్మి (561)



ఖుద్దూస్ (578)



పావని (577)



అనూష (576)



ప్రణతి (573)



లక్ష్మీప్రసన్న (572)

శ్రీశ్రీనివాస అపూర్వ విజయం

ఉయ్యూరు: పదో తరగతి ఫలితాల్లో ఉయ్యూరు శ్రీశ్రీనివాసా విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన జి.అనూష (587) మార్కులతో ప్రథమస్థానంలో నిలిచింది. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ అభినందించారు.

596 మార్కులు సాధించిన గన్నవరం విద్యార్థిని

గన్నవరం: స్థానిక విద్యానగర్ నారాయణ స్కూల్‌కు చెందిన షేక్ ఆఖిల 596 మార్కులు సాధించిందని ప్రిన్సిపాల్ షేక్ బాషా తెలిపారు. మరో విద్యార్థిని నాగవెంకట పద్మావతి లాస్యప్రియ 591, మరో 54 మంది 500పైగా మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

గన్నవరంలో 66 శాతం ఉత్తీర్ణత

గన్నవరం: టెన్త్ ఫలితాల్లో గన్నవరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 66 శాతం ఉత్తీర్ణతను సాధించారు. వీరపనేనిగూడెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణతను సాధించగా, ఆ పాఠశాల విద్యార్థిని ఎస్.ప్రణతి 573 మార్కులతో టాపర్‌గా నిలిచింది. మొత్తం 81 మంది విద్యార్థులకు 78 మంది ఉత్తీర్ణులుకాగా, 20 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. గన్నవరం జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 98 మందికిగాను 72 మంది(71 శాతం) ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ కొండా రవికుమార్ తెలిపారు. వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 48 మందికి 33 మంది(69 శాతం), కేసరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 64 మందికి 43 మంది(67 శాతం), వెదురుపావులూరు జెడ్పీ హైస్కూల్‌లో 76 మంది విద్యార్థులకు 45 మంది(60 శాతం), గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 58 మందికి 43 మంది(58 శాతం) ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 111 మందికి 60 మంది(54 శాతం), గన్నవరం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 80 మందికి 43 మంది(54 శాతం), సూరంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 37 మందికి 13 మంది (34 శాతం) విద్యార్థులు ఉత్తర్ణతను సాధించారు. కేసరపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని వై.లక్ష్మీప్రసన్న 572 మార్కులు, దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పి.పవన్ వెంకటశివసాయి 570 మార్కులు సాధించారు.

రామవరప్పాడులో ఉత్తమ ఫలితాలు

రామవరప్పాడు: రామవరప్పాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొత్తం 216 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 143 మంది పాసై 66 శాతం ఉత్తీర్ణత సాధించారు. మెదరపూడి సాయి సింధు(589), నక్కరాజు కుసుమ(588), జొన్నలగడ్డ హాసిని సాత్విక(583) మార్కులతో తొలి మూడు స్థానాల్లో , 500లకు పైగా మార్కులను 25 మంది విద్యార్థులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తాయారు తెలిపారు. నిడమానూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొత్తం 232 మంది పరీక్షలకు హాజరవ్వగా 168 మంది పాసై 73 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. రాచమళ్ల డింపుల్ ప్రియ(581), అల్లిపురపు భార్గవి (573), నూతి లావణ్య(566) ఉత్తమ మార్కులు సాధించగా, 500లకు పైగా 32 మంది విద్యార్థులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌లో నూరు శాతం ఉత్తీర్ణత

గన్నవరం: స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు వార్డెన్ ఎం.ప్రకాష్ తెలిపారు. హాస్టల్‌లో మొత్తం తొమ్మిది మంది విద్యార్థులకుగాను 9 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. జె.వరుణ్‌కుమార్ 552 మార్కులతో జెడ్పీ బాలుర హైస్కూల్ టాపర్‌గా నిలిచినట్లుగా చెప్పారు. నూరు శాతం ఉత్తీర్ణతతో తమ హాస్టల్‌లో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లుగా ఆయన తెలిపారు.

నున్న జెడ్పీ విద్యార్థుల దుందుభి

నున్న(విజయవాడరూరల్): టెన్త్ ఫలితాల్లో నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పల్లపోతుల రాజేష్(591), గుంటా ప్రణతి(578), కాటూరి కారుణ్య(576) మార్కులతో తొలి మూడో స్థానాల్లో నిలిచారు. హైస్కూల్ నుంచి 153 మంది పరీక్షలకు హాజరుకాగా వారిలో 98 మందితో 63.40 శాతం ఉత్తీర్ణత సాధించారు. హైస్కూల్ లో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ 19 మంది విద్యార్థులకు 500కు పైగా మార్కులు సాధించారన్నారు. జిల్లా స్థాయిలో తొలి 20 ర్యాంక్‌ల్లో మూడు స్థానాలను సాధించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ జి.కుమార్, ఫస్ట్ అసిస్టెంట్ ఎస్.రవి ప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని పూర్వజశ్రీకి అభినందనం

నున్న(విజయవాడరూరల్): టెన్త్ ఫలితాల్లో నున్న శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని ఎం.పూర్వజశ్రీ(592), సీహెచ్ ధనిషితా(590), బి.పూర్ణ తేజశ్వి(582) మార్కులతో తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విద్యార్థులను శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం ఎం.మురళీకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నరేంద్ర, ప్రిన్సిపాల్ సీహెచ్.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాపులపాడు విద్యార్థుల సత్తా

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మండలంలో వీరవల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దేవరకొండ హేమంత్ సాయి కుమార్(580), కానుమోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎం.రమ్యశ్రీ(579) మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. వీరవల్లి వాణి విద్యానికేతన్ విద్యార్థులు షేక్ జలీలా(590), జి.శ్రావ్యశ్రీ(589) మార్కులు సాధించారు. మండలంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాల్లో 440 మంది పరీక్షలకు హాజరు కాగా, 358 మంది ఉత్తీర్ణులై, 81 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ

కంకిపాడు: కార్యకర్తలకు ఎల్లప్పుడూ వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలో బుధవారం దేవభక్తుని చక్రవర్తి విస్తృతంగా పర్యటించి పార్టీ నేతలను, కుటుంబాలను కలుసుకున్నారు. పార్టీ సానుభూతి పరుడు షేక్ పెద మస్తాన్(బాబూరావు) అనారోగ్యానికి గురై మోకాలి ఆపరేషన్ చేయించుకోవటంతో ఆయనను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆకుల రంగారావు సోదరుడు ఆకుల ముసలయ్య మృతి చెందటంతో భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పార్టీ స్థితిగతులపై ముఖ్య నాయకులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవటంతో ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు, ఎంపీటీసీ నందిపాటి బిందుమాధవి, స్థానిక నాయకులు కలకోట ప్రసాద్‌రెడ్డి, మరీదు హరిబాబు, కె.జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



ముసలయ్య భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి

నున్న(విజయవాడరూరల్): పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల విజయవాడ మేత్రాసనం, నున్న యేసు తిరు హృదయ దేవాలయంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫాదర్ జోషి మాట్లాడుతూ.. 1936 డిసెంబర్ 17న అర్జెంటీనాలో జన్మించిన ఆయన 2013 మార్చి 13 నుంచి 266వ పోప్‌గా కొనసాగుతున్నారన్నారు. లాటిన్ అమెరికా నుంచి పోప్‌గా ఎన్నికైన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచారు. ఆయన మరణం క్రైస్తవులను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయనే ఆత్మకు శాంతి చేకూరాలని పోప్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సహాయక గురువులు ఫాదర్ అజ్జు, సెయింట్ అన్స్ సిస్టర్స్, ఎంసీ బ్రదర్స్, సంఘస్తులతో కలిసి పరిశుద్ధ దివ్యబలి పూజ, పరిశుద్ధ పూజ నిర్వహించారు.

కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో..

పెనమలూరు: కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళులర్పించారు. ఫాదర్ సలివేంద్రశౌరి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పోప్ ఫ్రాన్సిస్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దివ్యబలి పూజ నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక పార్థనలు చేశారు. మరో మూడు రోజుల పాటు పోప్ ఫ్రాన్సిస్ సంతాప దినాలు నిర్వహించనున్నారు. కార్మెల్ దేవాలయంలో ప్రతి రోజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొని పోప్ ఫ్రాన్సిస్ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించాలని ఫాదర్ శౌరి కోరారు. కార్యక్రమంలో ఉపదేశకులు, సీటీసీ సిస్టర్స్, గంగూరు, పోరంకి, కామయ్యతోపు, కానూరు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.



నున్నలో నివాళులర్పిస్తున్న ఫాదర్లు, సిస్టర్స్

పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

సాక్షి స్పందన

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని 'ప్రసాదంపాడులో పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికన సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేసి చర్యలు తీసుకున్నారు. సాయిబాబా ఆలయం సమీపంలో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్లతో సేకరించి బయటి ప్రాంతాలకు తరలించారు. ఈ పరిసరాలు మొత్తం శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. అలాగే గ్రామంలో పారుదలకు నోచుకోని డ్రెయిన్లలో పూడిక తీయించారు. ప్రధాన డ్రెయిన్‌లో మురుగునీరు పారుదలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగించామన్నారు. ప్రమాదకరంగా మారిన ఖాళీ స్థలాలను గుర్తించామని త్వరలో నోటీసులు అందజేస్తామన్నారు. చెత్తను రహదారుల వెంట పడేయకుండా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.



సాయిబాబా ఆలయం వద్ద బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

పెనమలూరు: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ పి.భవానిప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ ఎస్సీ కార్పొరేషన్ సేవలు, రవాణా, వ్యవసాయ రంగాలకు రుణాలు మంజూరు చేస్తోందన్నారు. 21–50 మధ్య వయసు ఉన్న వారు తెల్లరేషన్ కార్డు, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ జతచేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు వార్డు సచివాలయాల్లో సంప్రదించాలని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: తాడిగడప – పెదపులిపాక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. దీని కారణంగా తాడిగడప గ్రామం, శ్రీనివాసానగర్ కాలువ కట్ట, పద్మజానగర్, లిమ్రా కాలనీ, కార్మికనగర్, ఎస్టీబీఎల్‌కాలనీ, పెదపులిపాక గ్రామం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గన్నవరం: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి వై.రజని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతుల ముందుగా రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పంట వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం గోనె సంచుల కొరత ఉన్నప్పటికి రైతుల అవసరాలకు అనుగుణంగా రైతు సేవా కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉంచామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీలు

పెనమలూరు: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ సనత్‌నగర్‌లో వివిధ మసీదులకు చెందిన పెద్దలు మృతుల ఆత్మ శాంతికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సనత్‌నగర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో మస్జీద్-ఏ- మహమ్మదీయ అధ్యక్షుడు ఖలీల్, యునైటెడ్ ముస్లిం హెల్పింగ్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాన్‌బాషా మట్లాడుతూ.. ఉగ్రవాదులు అమాయకుల ప్రాణాలు బలి తీసుకోవటం దారుణమని ఖండించారు. ముస్లింలు పవిత్ర గ్రంథం ఖురాన్‌ను ఎంత పవిత్రంగా చూస్తామో భారతదేశ జాతీయ వాదాన్ని కూడా అంతే పవిత్రంగా చూస్తామన్నారు. మాతృభూమి సంరక్షణకు ప్రతి ముస్లిం కట్టుబడి ఉంటారన్నారు. భారతదేశంలో ఉగ్రవాదం పట్ల ప్రభుత్వం కఠినంగా ఉండి చర్యలు తీసుకోవాలని కోరారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన వారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం సంఘ పెద్దలు ముఫ్తి మహమ్మద్‌అన్సర్, ఆసిఫ్‌బాషా, ముతవల్లి ఖలీల్, సంఘ సభ్యులు అబ్దుల్ రెహమాన్, సర్దార్ సనావుల్లా, ఖాదర్ లతీఫ్, జక్రియ, సిద్దిఖ్, సాబు, రబ్బాని, రజాక్, హమీద్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులకు నిరసనగా శాంతి ర్యాలీ

గన్నవరం: పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా గన్నవరంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఆధ్వర్యంలో బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. క్యాండిల్స్‌ను చేతపట్టుకుని పురవీధుల్లో ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ...పహల్గాంలో ఉగ్రవాదులు దాడులు చేసి 28 మంది టూరిస్టులను పొట్టనపెట్టుకోవడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి, వార్డు సభ్యులు రత్నమాల, దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



కానూరులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న జెడ్పీటీసీ ఎలిజబెత్‌రాణి, నాయకులు